ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఎల్బీనగర్, సెప్టెంబర్ 9 : జీహెచ్ఎంసీ జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. జోనల్ కార్యాలయంలో ఒక టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదు అందింది. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి శానిటేషన్‌కు సంబంధించి ఫిర్యాదులు అందాయి.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

సభ్యత్వం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కందుకూరు, సెప్టెంబర్ 9 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు జగనాథ్ శర్మ, కల్పన కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో పర్యటించి ఉపాధ్యాయుల చేత సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపీఎస్ పునరుద్ధరణ అయ్యేంతవరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి, హెల్త్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులకు జూలై మాసం వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చెప్పారు. మండల అధ్యక్షుడు ఎడ్ల కల్లేశ్, ప్రధాన కార్యదర్శి డాక్టరు జై బుగ్గరాములు, మండల కార్యదర్శి నజీర్, హుస్సేన్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

వనస్థలిపురం, సెప్టెంబర్ 9 : కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. సోమవారం డివిజన్‌లోని టీచర్స్ కాలనీలో జీహెచ్ఎంసీ డీఈ దామోదర్‌తో కలిసి పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో పనులు జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో పాలు పంచుకోవాలన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

హామీలు అమలు చేయని కాంగ్రెస్

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్ , సెప్టెంబర్ 9: నిరుపేదలపై ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలపై దారుణంగా వ్యవహరిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తుందని వాపోయారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చడంతో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. అధికారం కోసం అమలు సాధ్యంకానీ హామీలను గుప్పించిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మేనిఫెస్టోలో చేర్చిన అంశాలను, ప్రజలకు అందించిన వాగ్దానాలను నెరవేర్చక పోగా నిరుపేదలపై మరింత కఠిన వైఖరి అవలంబిస్తూ అణిచివేతకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలులో తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కాని కొందరు స్వార్థరాజకీయాల కోసం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసానందాన్ని పొందుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ. 250 కోట్ల హెచ్ఎండీఏ నిధులను అడ్డుకుని అభివృద్ధిని అడ్డుకునే కుటిల యత్నం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పుకునేందుకు అక్కడ ఫొటోలకు ఫోజులిచ్చి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే నియోజకవర్గానికి మంజూరైన నిధులను విడుదల చేసి ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పరిశీలన

చెట్లకొమ్మల నరికివేత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

మలక్‌పేట, సెప్టెంబర్ 9: వినాయక నిమజ్జనాలు సమీపిస్తున్న నేపథ్యంలో మూసారాంబాగ్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ సిబ్బంది చేపట్టిన నిమజ్జన ఏర్పాట్ల పనులను సోమవారం డివిజన్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. నిమజ్జన దారుల్లో వేలాడుతున్న కేబుల్, విద్యుత్ వైర్ల తొలగింపు, చెట్లకొమ్మల నరికివేత, రహదారులపై గుంతల పూడ్చివేత తదితర పనులను ఆమె పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని కార్పొరేటర్ భాగ్యలక్ష్మి వారికి సూచించారు. 12 నుంచి చిన్న చిన్న వినాయకుల నిమజ్జనాలు ప్రారంభమవుతాయని, ఈ లోపుగా అన్ని పనులు పూర్తవ్వాలని ఆదేశించారు. విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయా లేవా సరిగ్గా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి సూచించారు. యూబీడీ మేనేజర్ కృష్ణ, లైన్‌మెన్ లలిత్, రాజు, రాము, చందు, సందీప్, ఉమేశ్, దినేశ్ పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ ఉత్సవాలు

కాచిగూడ,సెప్టెంబర్ 9: ప్రజలు,మండపాల నిర్వాహకులు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నెహ్రూనగర్ జై భజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

కందుకూరు, సెప్టెంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తల్లోజు వినోద్ చారి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు సొడపు వెంకటేశ్ గౌడ్‌లు కలిసి విద్యార్థుల సమస్యలను ఆయన దృష్టికి తీసువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతను ఇస్తుందని చెప్పారు. విద్యార్థుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి, కమల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 9: వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ ఈటల రాజేందర్‌ను రాక్‌టౌన్‌కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సభ్యులు సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, సంపత్‌కుమార్, రాంచంద్రారెడ్డి, సుదర్శన్ తదితరులు సోమవారం కలిసి ఆహ్వానించారు.

బీసీలను చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం

మాట్లాడుతున్న సమాజ్ వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి

కందుకూరు, సెప్టెంబర్ 9 : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్, సమగ్ర కులగణన,స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు , అమలు చేయకుండా ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికల శ్రీహరి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని సీతారామ శాస్త్రీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటం చేయాలని కోరారు. మాజీ ప్రధాన మంత్రి వీపీ సింగ్ హయాంలో కూడా మండల కమిషన్ రిజర్వేషన్లు వివిధ ఒత్తిళ్ల మధ్య మొక్కుబడిగా అమలు అయినట్లు తెలిపారు.ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బీసీ మంత్రాన్ని ఉపయోగించి తిరిగి ప్రధాన మంత్రి అయ్యాడని తెలిపారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహిస్తామని, దేశంలో మొత్తం 75 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చెప్పి విస్మరిస్తుందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చకుండా దాటవేస్తుందని తెలిపారు. బీసీలపై చిన్నచూపు చూస్తే ప్రభుత్వంపై తిరుగబడుతామని తెలిపారు . ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కోటేశ్వర్ , మండల అధ్యక్షుడు పొడిపాల రమేశ్, కాకి అజయ్, అల్లె నర్సింహ, తేరెటి అంజయ్య, యాదగిరి, సాయిబాబా, వెంకటేశ్ పాల్గొన్నారు.

మాతృభాషను మరువొద్దు

భాషా దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

సైదాబాద్, సెప్టెంబర్ 9 : తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రజా కవి కాళోజీ నారాయణ రావు స్థిరస్థాయిగా నిలిచిపోతారని శ్రీవెంకటేశ్వర జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గధం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం చంపాపేటలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో కాళోజీ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాళోజీ కవిగా, రయితగా, ఉద్యమకారుడిగా, సాహితీవేత్తగా తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా నేడు ఆయన జయంతి వేడుకలను, తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతియేటా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుందని, పర భాష వ్యామోహంలో మాతృ భాషను ఎన్నటికీ మర్చిపోరాదని, పల్కుబడుల భాష, నా మాతృ భాష అని ఎలుగెత్తి చాటిన మహనీయడని కొనియాడారు. అన్యాయాన్ని ఎదిరించడానికి కాళోజీ రచించిన నా గొడవ అనే సంకలనం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు కవితలు, రచనలు, కథలలో కొన్నింటిని విద్యార్థులకు వినిపించి స్ఫూర్తి నింపారు. సంస్కృతం అధ్యాపకులు భార్గవి, అధ్యాపకులు సునీత, రమణయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత నారాయణకు సన్మానం

అవార్డు అందుకున్న డాక్టర్ వేముల నారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సైదాబాద్, సెప్టెంబర్ 9 : రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సైదాబాద్ కృష్ణానగర్‌కు చెందిన డాక్టర్ వేముల నారాయణను మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, సహోపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వేముల నారాయణ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును తీసుకున్నారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డితోపాటు సహా ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేముల నారాయణ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో తనపై బాధ్యత మరింతగా పెరిగిందని, విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమన్నారు. పాఠశాలలో విద్యార్థులను కవిత, వ్యాస రచనలు చేసే విధంగా నిరంతరం ప్రోత్సహిస్తుండటం తోపాటు వారి ఉజ్వల భవిష్యత్‌కు అంకిత భావంతో పనిచేస్తున్నానని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసి అందించటంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మురుగు..పరుగు

చంపాపేట రెడ్డికాలనీలో మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ లీకవుతున్న దృశ్యం

చంపాపేట, సెప్టెంబర్ 9: చంపాపేట డివిజన్ పరిధి రెడ్డి కాలనీలోని మారుతి హాస్పిటల్ లేన్, డెడాండ్ వీధిలోని డ్రైనేజీ మ్యాన్ హోల్స్ నుంచి రోజు తప్పించి రోజు మురుగు నీరు ఏరులై పారుతుంది. దీంతో ఆ వీధికి ఇరువైపులా ఉండే ప్రజలంతా ఇండ్లల్లోంచి కాలు బయట పెట్టాలంటే అంతా మురుగు మయంగా మారడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ప్రజలకు వాంతులు, విరేచనాలై తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. కాలనీ వీధిలో నిత్యం మురుగు నీరు ఏరులై పారుతున్నా, సంబంధిత అధికారులకు ప్రజల గోడు ఏమాత్రం పట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి మహా ప్రభువు అని అధికారులకు ఎన్నిసార్లు ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులకు విషయం తెలియజేసిన ప్రతిసారి గల్ఫర్ మిషన్ వాహనాలను పంపించి ఆ పూట మేరకు నామ మాత్రపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం చూపాలన్న ఉద్దేశం అధికారుల్లో ఉన్నట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగు సమస్యతో తామంత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుచున్నారు. లేదంటే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

గణేశ్ మహారాజ్‌కీ జై..

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, కృష్ణారెడ్డి, శరత్‌చంద్ర

గణనాథుడిని దర్శించుకున్న ఏసీపీ కృష్ణయ్య, చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 9 : గణేశ్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలతో కాలనీల్లోని వినాయక మండపాలు మార్మోగుతున్నాయి. వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా వినాయక మండపాల్లో కొలువుదీరిన గణనాథులు ఘనంగా పూజలు అందుకుంటున్నారు. దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలో గణేశ్ యువ భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 37 అడుగుల మట్టి గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ఉత్సవ నిర్వాహకులు నారాయణ రావు, నాగేశ్వర్‌రావు, రాము, జ్ఞాని, కర్ణ శ్రీనివాస్, చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. చైతన్యపురి కమలానగర్‌లో శ్రీ మణికంఠ అయ్యప్ప భక్త సమాజం చైర్మన్ తులసీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 31 అడుగుల భారీ మట్టి గణపతికి గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కుల శ్రీశైలం యాదవ్, వీఎంహోం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బేర బాలకిషన్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ కమిటీ డైరెక్టర్ బబ్బురి ఆనంద్‌కుమార్ గౌడ్, బాబురావు, నాగు తదితరులు పూజల్లో పాల్గొన్నారు. మోహన్‌నగర్ వైష్ణవినగర్ కాలనీలో పార్వతి పుత్ర గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద పూజలు నిర్వహిస్తున్నారు.

వాసవి కాలనీలో...

ఆర్కేపురం: ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహా గణపతి 37వ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య దంపతులు, చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి, వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్, గౌరిశెట్టి అరుణ్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంధి రమేశ్, గందే శ్రీకాంత్, మేఘమాల, సుజాత, లక్ష్మి, భ్రమరాంభ, లావణ్య, అరుణ, వనజ తదితరులు ఉన్నారు.

వనస్థలిపురంలో...

వనస్థలిపురం : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను వనస్థలిపురంలోని ప్రఖ్యాత లక్ష్మిగణపతి దేవస్థానంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో రుద్రహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పూజల్లో పాల్గొన్న చైర్మన్ శ్రీనివాస్, బేర బాలకిషన్, జక్కుల శ్రీశైలం యాదవ్

సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

వనస్థలిపురంలోని ప్రఖ్యాత లక్ష్మీగణపతి దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మహేశ్ కుమార్‌గౌడ్‌కు సన్మానం

ఎల్బీనగర్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, వాసవి సేవా కేంద్రం మల్లికార్జున్, శరత్ చంద్ర, సతీశ్ గౌడ్, అశోక్ తదితరులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కందుకూరు: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మండల నాయకులు కలిసి సన్మానించారు. మాజీ జడ్పీటీసీ, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడరు ఏనుగు జంగారెడ్డి, మండల కో ఆర్డినేటర్ ఎండీ అబ్జల్ భేగ్, క్రిష్ణా నాయక్, సరికొండ పాండు. జగన్, బాబు, శేఖర్, పాండు రంగారెడ్డి, శ్రీను,రాకేశ్‌గౌడ్, కుమార్, శేఖర్, రహీమ్, ఖాజామొహినొద్దీన్ తదితరులు గజమాలతో సన్మానించారు. మండల యువజన నాయకులు సొడపు వెంకటేశ్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తల్లోజు వినోద్ చారి, బొక్క రాజశేఖర్‌రెడ్డి, కమల్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలను తెలిపారు.

మన్సూరాబాద్: టీ పీసీసీ అధ్యక్షుడిగా నియమితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వనస్థలిపురం: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌గౌడ్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

16వరకు చేనేత హస్తకళ ప్రదర్శన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : అల్కాపురి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస జైన్ మాట్లాడుతూ.. ఈనెల 16 వరకు ప్రదర్శన, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.